సాక్షి తిరుపతి

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



ఉర్రూతలూగించిన మోహన్ మంత్ర!
రెండు రోజులుగా శ్రీవిద్యానికేతన్ విద్యానంస్థల్లో మోహన్ మంత్ర-2024 కార్యక్రమం విద్యార్థులను ఉర్రూతలూగిస్తోంది. - 8లో



బ్రహ్మోత్సవ వైభవం
తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. - 8లో



సీఎంకు సాదర వీడ్కోలు
తిరుపతి-తిరుమల పర్యటన అనంతరం తిరుగుపయనమైన సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు లభించింది. - 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి కొత్త ప్యాకేజీ టూర్

తిరుపతి(అలిపిరి): తిరుపతి నుంచి తిరుచానూరు – గుడిమల్లంకు రేపటి నుంచి కొత్త ప్యాకేజీ టూర్‌ను ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ ఎం.గిరిధర్‌రెడ్డి తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారు, గుడిమల్లంలోని పరశురామేశ్వర స్వామి ఆలయాల సందర్శనకు వెళ్లేవారి కోసం తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం నుంచి ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ఒకరికి టికెట్ ధర రూ.400 ఉంటుందన్నారు. కొత్త ప్యాకేజీ టూర్లను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9848007033లో సంప్రదించాలని సూచించారు.

సూళ్లూరుపేటలో స్పేస్ వాక్!



స్పేస్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట: ఇస్రో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ (షార్) ఆధ్వర్యంలో శనివారం సూళ్లూరుపేట పట్టణంలో స్పేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి హోలీక్రాస్ సెంటర్ మీదుగా డీఓఎస్ కాలనీ వరకు నిర్వహించిన స్పేస్ వాక్ కార్యక్రమాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ పరంగా అంతరిక్ష పరిశోధనల ద్వారా మనం దేశంలో సాంకేతిక పరమైన విప్లవాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, షార్‌కు చెందిన అధికారులు, సైంటిస్టులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాఖకు చెందిన ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు తిరుపతి జిల్లా సీఎఫ్ నాగేశ్వరరావును కేంద్ర కార్యాలయంలో వర్కింగ్ ప్లాన్ సీసీఎఫ్‌గా బదిలీచేశారు. తిరుపతి ఎస్వీజూ పార్క్ క్యూరేటర్ సెల్వంను తిరుపతి జిల్లా సీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డీఎస్‌వోగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతి డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. రంపచోడవరం డీఎఫ్‌ఏ నరేంధిరన్‌ను తిరుపతి బయోట్రీమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్‌గా నియామకం చేశారు.

రేపు ఎంబీఏ స్పాన్సర్ సీట్ల భర్తీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఈనెల 7వ తేదీన ఎంబీఏ కోర్సులో స్పాన్సర్డ్ సీట్ల భర్తీని చేపట్టనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ కార్యాలయానికి సోమవారం ఉదయం 10 గంటలకు చేరుకోవలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తొలి రోజు 3,067 ట్రిప్పులు

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తొలిరోజు శుక్రవారం (రాత్రి 12 గంటల వరకు) 3,067 ట్రిప్పుల ద్వారా 82,957 మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చినట్టు డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచి తిరుమలకు 1,530 ట్రిప్పుల ద్వారా 40,210 మంది, తిరుమల నుంచి తిరుపతికి 1,537 ట్రిప్పుల ద్వారా 42,747 మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు. అయితే వారిలో 54,866 మంది ప్రయాణికులు మాత్రమే శ్రీవారిని దర్శించుకున్నారని వెల్లడించారు. గత ఏడాది తొలి రోజు 3,009 ట్రిప్పుల ద్వారా 88,276 మంది ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది తొలి రోజు 5,319 మంది తగ్గారని ఆయన పేర్కొన్నారు.

వ్యాధులపై అవగాహన




మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, లావుగా మారిన నరాలు, బొడిపలు, నొప్పి లేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రిలో చూపించుకోవాలన్నారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



చిన్నశేష వాహన సేవ



హంస వాహనంపై ఊరేగుతున్న మలయప్ప

విపంచి.. విహరించి!

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవింద నామ స్మరణతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి. రెండో రోజు శనివారం రాత్రి స్వామివారు హంస వాహనాన్ని అధిరోహించి వీణాపాణియై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. అంతకుముందు ఉదయం చిన్న శేష వాహనంపై మురళీకృష్ణుడి అలంకారంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

అంగరంగ వైభవంగా తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ఉదయం చిన్న శేషుడిపై మలయప్ప విహారం
- రాత్రి హంస వాహనంపై విహరించిన దేవదేవేరులు
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం చిన్న శేషవాహన సేవ ఆద్యంతం రమణీయంగా సాగింది. స్వామివారు మురళీకృష్ణుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి(నాగలోకానికి రాజు)గా భావిస్తారు. శ్రీ వైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేష వాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్న శేష వాహనాన్ని దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీయోగ సిద్ధఫలం లభిస్తుందని ప్రశస్తి.

హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో..

శనివారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మ వాహనమైన హంస పరమ హంసకు ప్రతీక. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా భక్తులలో అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని (శరణాగతి) కలిగిస్తాడని అర్థం. పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఈఓ జే.శ్యామలరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

శనివారం ఉదయం చిన్నశేష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు.

అలరించిన కళాబృందాల ప్రదర్శన

చిన్నశేష వాహన సేవలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శన భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తింది. వాహన సేవల ముందు ఆంధ్ర రాష్ట్రంతో పాటు కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, ఒడిశా, మహారాష్ట్ర, మణిపూర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి 18 కళా బృందాలు, 472 మంది కళాకారులు తమ నృత్యాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.







ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 54,866 మంది స్వామివారిని దర్శించుకోగా.. 28,657 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.6 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పీఎం కిసాన్ నిధుల విడుదల

–ఒక్కో రైతుకు రూ.2వేలు జమ

తిరుపతి అర్బన్: రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు పెట్టుబడి నిధి కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పేరిట ఒక్కో రైతుకు రూ.2 వేల చొప్పున జమచేసింది. జిల్లాలో మొత్తం 1,38,804 మంది రైతులకు రూ.27.26 కోట్లు జమచేసినట్టు డీఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. మొత్తం మూడు విడతల్లో(ఒక్కో విడతకు రూ.2వేలు చొప్పున) రూ.6 వేలు జమచేయాల్సి ఉంది. ఇందులో భాగంగా శనివారం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్రలోని వాసీం జిల్లా నుంచి ఈ పథకానికి చెందిన నిధులు విడుదల చేశారు. కార్యక్రమాన్ని ప్రత్యేక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించడానికి వీలుగా తిరుపతిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సుధాకర్ అవకాశం కల్పించారు.



పీఎం కిసాన్ ప్రత్యక్ష ప్రసారంలో శాస్త్రవేత్తలు, రైతులు

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 సెషన్ కోసం 9, 11 తరగతుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వీ.శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అయితే 9వ తరగతిలో చేరడానికి 2024–25న 8వ తరగతి చదివి ఉండాలని, 01-05-2010 నుంచి 31-07-2012 మధ్యా కాలంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా 11 తరగతిలో చేరడానికి 2024–25లో పదో తరగతి చదివి ఉండాలని, 01-06-2008 నుంచి 31-07-2010 మధ్యలో జన్మించిన వారు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు.

మింగేస్తున్న రాహు–కేతువులు!

- పరిహారం తక్కువ ఇచ్చారని ఓ భక్తురాలికి తీవ్ర అవమానం
- దేవదాయశాఖ మంత్రికి ఫిర్యాదు
- వేద పండితుడు, ఏపీఆర్వో సస్పెన్షన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకులు, అధికారులు కుమ్మక్కై భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. తాము అడిగినంత ఇవ్వకపోతే కొడుతూ, తిడుతూ, శాపాలు పెడుతూ చిత్ర హింసలకు గురిచేస్తున్నారు. శనివారం ఇలాంటిదే వెలుగు చూసింది. దీనిపై ఓ భక్తురాలు దేవదాయశాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణ చేపట్టాలని ఈఓను ఆదేశించారు. ఈ మేరకు ఈఓ ఓ అర్చకుడు, అధికారిని విధులను నుంచి తొలగించారు. వివరాలు.. ఓ భక్తురాలు రూ.5 వేల రాహు–కేతు పూజ చేసుకున్నారు. పూజ అనంతరం అక్కడి అర్చకుడు పెరిరాజశర్మ గోదానం, భూదానం, వస్త్రదానం, ఏదో ఒక దానం చేయాలని హుకుం జారీచేశారు. లేదంటే రాహు పరిహారంగా తనకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు భక్తురాలు రూ.100 ఇవ్వడంతో కోపోద్రిక్తుడైన ఆ అర్చకుడు భక్తురాలిని తీవ్రంగా అవమానించాడు. రాహు–కేతువుల పైన ఉండే పూలకు బదులుగా పసుపు, కుంకుమను చేతుల్లోకి తీసుకొని ఆమె నెత్తి మీద బలంగా కొట్టినట్టు బాధితురాలు పేర్కొన్నారు. అంతేకాకుండా రూ.5వేల రాహుకేతు పూజ చేసుకుంటే అంతరాలయ దర్శనం కల్పించకుండా బయట నుంచే వెళ్లాలని హుకుం జారీ చేశారని, అదే ఏపీఆర్వో శ్రీనాథ్ 25 మంది భక్తులతో అక్కడకు వచ్చి అంతరాలయ దర్శనం చెయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆమెను తల మీద పసుపు కుంకుమ చూసి ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు లోనికి అనుమతించలేదు. ఇంతలో అటుగా వస్తున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డికి శ్రీకాళహస్తీశ్వరాలయంలో తనకు జరిగిన అవమానంపై బాధిత భక్తురాలు ఫిర్యాదు చేశారు. మంత్రి వెంటనే ఈఓకు ఫోన్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు వేద పండితుడు పెరిరాజ శర్మ, ఏపీఆర్వో శ్రీనాథులను సస్పెండ్ చేస్తున్నట్లు ఈఓ ప్రకటించారు.

తూపిలిపాళెం బీచ్ పర్యాటకుల మనసు దోచుకుంటోంది. ఎగసిపడే కెరటాలు.. ఆహ్లాదాన్ని పంచే సరుగుడు చెట్లు.. పర్వదినాల్లో పుణ్యస్నానాలకు నిలయంగా మారుతోంది. లైట్ హౌస్ వెలుగులు.. తీరం వెంబడి సహజ సిద్ధమైన సుందర దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తోంది. పర్యాటకరంగం మరింత అభివృద్ధి చెందితే తీరం వెంబడి ఉన్న 14 గ్రామాలు ప్రగతి పథంలో దూసుకుపోయే అవకాశం ఉంది.



తూపిలిపాళెం బీచ్‌లో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

తూపిలిపాళెం! పర్యాటకుల స్వర్గధామం

- మనసు దోచే ఓడపాళెం లైట్ హౌస్
- ఆహ్లాదాన్ని పంచే సరుగుడు చెట్లు
- నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది రాక
- అభివృద్ధికి మెరుగులద్దితే పర్యాటకం పరవశమే!

వాకాడు: తూపిలిపాళెం సముద్రతీర ప్రాంతం అందాల తీరంగా పర్యాటకుల మదిలో గుర్తింపు పొందింది. మత్స్యకారుల కుగ్రామమైన ఒకప్పటి 'వాగర్రు' కాల గతిలో తూపిలిపాళెంగా మారిపోయింది. తిరుపతి జిల్లా వాకాడు మండలం, తూపిలిపాళెం ఆక్వా పారిశ్రామిక కేంద్రంగా, మత్స్యసంపద విక్ర య కేంద్రంగా, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రకృతి సోయగాలు ఆకట్టుకునే సముద్రపు బీచ్, జెట్టీ నిర్మాణం, రొయ్య పిల్ల ల హేచరీలు, రొయ్యల చెరువులు తూపిలిపాళెం తీరానికి ఆభరణాలుగా భాసిల్లుతున్నాయి.

ఆకట్టుకుంటున్న లైట్ హౌస్

వాకాడు సముద్ర తీరప్రాంతమైన ఓడపాళెం వద్ద ఏర్పాటు చేసిన లైట్‌హౌస్ ఆకట్టుకుంటోంది. రాత్రిపూట వెలుగులు విరజిమ్ముతూ కళకళలాడే లైట్‌హౌస్ అందాలను చూసేందుకు పర్యాటకులు ఎంతో ఇష్టపడుతుంటారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న కొత్త లైట్ హౌస్ 120 మీటర్ల ఎత్తులో ఉంది. పైన 24 లైట్లు అమర్చిబడి ఉన్నాయి. దీని కాంతి 44 మైళ్ల దూరం వరకు వెదజల్లుతుంది. పర్యాటకులు ఇక్కడి దృశ్యాలను వీక్షించేందుకు వివిధ వాహనాల్లో తరలివస్తుంటారు. పర్యాటకులు పచ్చని సవకతోటల మధ్య వన భోజనాలు చేస్తుంటారు.

తూపిలిపాళెం బీచ్‌కు ఇలా చేరుకోవచ్చు!

తిరుపతి జిల్లా కేంద్రం నుంచి నాయుడుపేట పట్టణానికి చేరుకుని అక్కడి నుంచి వయా చిట్టమూరు, వాకాడు మీదుగా తూపిలిపాళెం చేరుకోవచ్చు. అలాగే నెల్లూరు జిల్లా కేంద్రం నుంచి గూడూరు పట్టణానికి చేరుకుని అక్కడి నుంచి కోట, విద్యానగర్, వాకాడు మీదుగా తూపిలిపాళెం రావచ్చు. ఇక్కడి తీరానికి తిరుపతి జిల్లా నుంచే కాకుండా నెల్లూరు, చిత్తూరు, కడప, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. శివరాత్రి, ముక్కోటి ఏకాదశి, ఉగాది, సూర్యగ్రహణం, చంద్రగ్రహణం, కార్తీక పౌర్ణమి, వినాయక చవితి విగ్రహాల నిమజ్జనం సమయాలలో వేల సంఖ్యలో పర్యాటకులు, భక్తులు వస్తుంటారు.

పర్యాటకరంగం అభివృద్ధి చెందాలి



తూపిలిపాళెం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని నేతలు హామీలిచ్చి మిన్నకుండి పోయారు. గత ప్రభుత్వంలో తూపిలిపాళెం తీరాన్ని పర్యాటకరంగంగా అభివృద్ధి చేసేందుకు సర్వే జరిపారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో ఇది మూలన పడింది. పర్యాటకరంగం మెరుగుపడితే ఇక్కడి 14 గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– వీవీ.రమణయ్య, వైస్ ఎంపీపీ

20 వేల మందికి ఉపాధి



పర్యాటక కేంద్రానికి తూపిలిపాళెం అనువైన ప్రదేశం. పర్యాటక కేంద్రంగా మారడం వల్ల దాదాపు 20 వేల మందికి పైగా ఉపాధి దొరుకుతుంది. మత్స్యకారుల మత్స్య సంపదకు మంచి గిరాకీ వస్తుంది.

– మహీంద్ర పెద్దకాపు, తూపిలిపాళెం

గతంలో పర్యాటక కేంద్రానికి గ్రీన్ సిగ్నల్

తూపిలిపాళెం ప్రాంతాన్ని పర్యాటకరంగంగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఎంపీ గురుమూర్తి కేంద్రంతో సంప్రదించి పర్యాటక కేంద్రానికి బీజం వేశారు. ఈ మేరకు సర్వేలు నిర్వహించి 3.5 ఎకరాల మేర భూములు సైతం కేటాయించారు. ఆపై ప్రభుత్వం మారడంతో ఇది మూలన పడింది.



తూపిలిపాళెం తీరంలో మత్స్యకారుల చేపల వేట



సముద్రపు ఒడ్డున బోట్లతో కుస్తీ పడుతున్న మత్స్యకారులు



సముద్ర తీరంలో ఆహ్లాదకరమైన సరుగుడు చెట్లు

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యాపారి మృతి

కోట:కోట బజారు వీధిలో వస్త్ర వ్యాపారం చేస్తున్న దయాలాల్(60) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజస్థాన్ రాష్ట్రం, జాలోర్‌కు చెందిన దయాలాల్ కోటలో మూడేళ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఉదయం దుకాణం తెరిచి పక్క వ్యాపారులతో కాసేపు మాట్లాడిన అతను కొద్ది సేపటికే దుకాణంలోని గదిలో ఉరేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ పవన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య, పిల్లలు బెంగళూరులో ఉండగా.. అతనొక్కడే కోటలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బంధువులకు సమాచారం అందించారు. అప్పుల కారణంగానే వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

బెదిరింపు ఈ మెయిల్‌పై కేసు

ఏర్పేడు: బెదిరింపు ఈ మెయిల్‌పై తిరుపతి విమానాశ్రయ క్రైం ఇంటిలిజెన్స్ వింగ్(సీఐడబ్ల్యూ) ఎస్‌ఐ నాగరాజు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. శుక్రవారం తమ అధికారిక ఈ మెయిల్‌కు బెదిరింపు కంటెంట్‌ను పంపినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు.

బ్రహ్మోత్సవ వైభవం

- చిన్న శేషుడు, హంస వాహనాలపై కల్యాణ వెంకన్న చిద్విలాసం
- ఆకట్టుకున్న కళా బృందాల ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యాలు
- వాహన సేవల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి



చిన్న శేషవాహన సేవలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామి వారు ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ప్రధాన ఆలయంలో వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి తోమాలసేవ, కొలువు, పంచాగశ్రవణం, సహస్రనామార్చన వంటి నిత్య పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి శ్రీకృష్ణుడిగా అలంకరించి, చిన్న శేష వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం వాహన మండపం నుంచి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అలాగే రాత్రి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి సరస్వతీదేవి అలంకరణలో హంస వాహనంపై అధిష్టింపజేసి గ్రామంలో ఊరేగించారు. వాహన సేవల్లో గ్రామస్తులు పాల్గొని హారతులు పడుతూ మొక్కులు తీర్చుకున్నారు.



హంస వాహనంపై కల్యాణ వెంకన్న

కళ..భళా

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో కళాకారులు స్వామి వారి అవతారాలను ధరించి భక్తులను ఆకర్షించారు. కళాకారులతో పెద్ద ఎత్తున భక్తులు సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు. అదేవిధంగా కోలాటాలు, చెక్క భజన, పిల్లనగ్రోవులతో భజన బృందాలు చేసిన విన్యాసాలు అలరించాయి.

కనుల పండువగా స్నపన తిరుమంజనం

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం ఉదయం 11 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం సేవను కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, కొబ్బరినీళ్ల పరిమళ భరిత సుగంధ ద్రవ్యాలతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. భక్తులు అందరికీ స్వామి వారికి అభిషేకించిన చందనాన్ని ప్రసాదంగా పంచిపెట్టారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనిచేస్తూ.. కుప్ప 'కూలి పోయాడు'!

వాకాడు: ఉపాధి పనులు చేస్తూ ఓ కూలీ అక్కడే కుప్పకూలిపోయిన ఘటన శనివారం వాకాడు మండలం, పామలతేరి గ్రామంలో చోటు చేసుకుంది. పామలతేరి గ్రామానికి చెందిన తీపలపూడి వెంకటయ్య(50) రోజూలాగే ఉపాధి పనులు చేస్తున్నాడు. హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు వదిలాడు. ఏపీఓ విజయమ్మ పరిశీలించారు.



మృతి చెందిన వెంకటయ్య

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట: తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటన ముగించుకుని శనివారం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగుపయనమైన సీఎం చంద్రబాబు నాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, మురళీ మోహన్, థామస్, ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, వరప్రసాద్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాచ్‌పాయ్, కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, డీఆర్‌ఓ పెంచల్ కిషోర్ తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సీఎం సాయం



క్యాన్సర్ రోగికి రూ.5లక్షలు చెక్కు ఇస్తున్న సీఎం చంద్రబాబు

రేణిగుంట విమానాశ్రయంలో రేణిగుంటకు చెందిన మానసిక దివ్యాంగుడు పసుపులేటి సురేంద్రబాబు(30) క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బాధితుడికి సాయం చేయాలని కోరడంతో వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు రూ.5 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్ అందజేశారు. స్వతహాగా చంద్రబాబు అభిమాని అయిన సురేంద్రబాబు కోరిక మేరకు ఆప్యాయంగా పలకరించి ఫోటో దిగారు. అలాగే రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన కె.సుబ్బరత్నమ్మకు రూ.50 వేలు చెక్కు అందించారు.

హత్య చేసి.. మామిడితోటలో పడేసి!



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ జయచంద్ర (ఇన్‌సెట్) ప్రవీణ్(ఫైల్)

ఏర్పేడు: ఓ వ్యక్తిని హత్యచేసి గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని మామిడితోటలో పడేసి వెళ్లిన ఘటన మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ జయచంద్ర అందించిన వివరాలు.. రేణిగుంట మండలం, అత్తూరు పంచాయతీ పరిధి, మొలగమూడి ఎస్సీ కాలనీకి చెందిన మొలగమూడి ప్రవీణ్(35)ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. మృతదేహాన్ని మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని ఓ మామిడి తోటలో పడేశారు. శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ముఖం, శరీరంపై బలమైన గాయాలున్నట్లు గుర్తించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి హత్య చేశారా? కుటుంబ తగాదాలు కారణమా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉర్రూతలూగించిన మోహన్ మంత్ర!



గల్లీ క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు



లైవ్ మ్యూజిక్ షోతో గాయకుడు రేవంత్

చంద్రగిరి: రెండు రోజులుగా శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న మోహన మంత్ర-2024 కార్యక్రమం ఉర్రూతలూగిస్తోంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు విచ్చేశారు. శనివారం నిర్వహించిన పలు సాంకేతిక యాప్‌లకు సంబంధించి నిర్వహించిన వర్క్‌షాపులు విద్యార్థుల మేథో శక్తికి దోహదపడుతాయని అధ్యాపకులు తెలిపారు. నృత్య, గాన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫన్ గేమ్స్, లక్కీ డ్రా, డీజే హౌస్, హర్రర్ హౌస్, డిజిటల్ ఈవెంట్స్, ఫుడ్ చాలెంజ్, ట్యాలెంట్ ఎగ్జిబిషన్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, ఫ్లాగ్ పాటింగ్, ఎస్కేప్ రూం, బ్రేక్ డ్యాన్స్, కొలంబస్, డ్రాగన్ ట్రెన్, వాటర్ వాక్ వంటి కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉర్రూతలూగించిన మ్యూజిక్ షో

మోహన మంత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకులు రేవంత్, బిందు ఆధ్వర్యంలో నిర్వహించిన లైవ్ మ్యూజిక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల లైటింగ్ షోల మధ్య నిర్వహించి లైవ్ మ్యూజిక్ షో ఔరా అనిపించింది.